# గొప్పవాడు

## కోరుకొండ సత్యానంద్

సమయం పదకొండు గంటలయ్యింది

పెన్ను మూత పెట్టేసి ఒక్క నిముషం ఏదో ఆలోచనలో పడ్డారు రంగనాథంగారు గుండె బరువేదో దిగిపోయినట్లు తేలిగ్గా ఉన్నా ఇల్లు చిన్నబోయి మనసు మూగవోయినట్లుగా ఉంది ముసురుతున్న ఆలోచనల్ని ప్రక్కకు పెట్టేసి టేబిల్ లైటు ఆర్పేయడానికి స్విచ్ మీద వేలు పెట్టారు

లక్ష్మి ఇక్కడే కూర్చుని చదువుకొనేది ఇప్పుడీ టేబులు, కుర్చీ ఈ ఇల్లు ఖాళీ అయిపోయినట్లు, ఎందరో ఉండి వెళ్ళిపోయినట్లుగా ఉంది అని మనసులో అనుకొని టేబుల్ లైటు ఆర్పేసి బెడ్ లైటు వేశారు

అంతలోనే వ్రాసిన నాలుగు ఇన్‌లాండ్ లెటర్లని అంటించలేదన్న విషయం గుర్తొచ్చి మరలా టేబుల్ లైటు వేసి మూడు ఉత్తరాల్ని అంటించారు నాలుగో ఉత్తరాన్ని కూడా అంటించబోయి ఆగిపోయారు

కారణం ఆ ఉత్తరాన్ని మరలా ఒకసారి చదవాలనిపించింది అతనికి మడతపెట్టిన ఉత్తరాన్ని విప్పిన రంగనాథంగారి దృష్టి అందులోని అక్షరాల వెంట పరుగులు తీసింది

చిరంజీవి కుమారుడు సుందరానికి నీ తండ్రి ఆశీర్వదిస్తూ వ్రాయునది

ఉభయక్షేమానంతరం

లక్ష్మి పెళ్ళి మొన్నటి రోజున అంటే 22 9 86 తేదీన జరిగిపోయింది ఈ విషయం కోడలికి చెప్పు చి సౌ కోడలికి ఆశీస్సులు పిల్లలికి ముద్దులు

ఉంటాను ఇట్లు నీ తండ్రి

రంగనాథం!

ఆ ఉత్తరాన్ని చదివి భారంగా నిట్టూర్చారు మిగిలిన మూడు ఉత్తరాల్లోనూ అదే విషయాన్ని అలాగే వ్రాశారు ఆ ఉత్తరాన్ని కూడా అంటించేసి లైటు ఆర్పేశారు

భారంగా లేచి మంచం మీద వాలిన రంగనాథంగార్ని ఆలోచనలు చుట్టుముట్టాయి

అతని ఆలోచనలన్నీ ఈ మధ్య జరిగిన ఆ సంఘటనలోని సంభాషణ చుట్టూనే తిరుగుతున్నాయి అలాంటి మాటల్ని తను వినాల్సి వస్తుందని, వాళ్ళు అలా మాట్లాడతారని కలలో కూడా ఊహించలేదు రంగనాథంగారు ఆ మాటలు విన్న ఆ సమయంలో రంగనాథంగారు ఆశ్చర్యపోయారు ఆవేశపడిపోయారు శరీరంలోని రక్తం అంతా గుండె మీద దాడి చేస్తున్నట్లు మెదడు ముక్కలైపోతున్నట్లు నరాలు తెగిపోతున్నట్లు గుండెలో బాద కడుపు తీపిని హత్య చేస్తున్నట్లు చేదు అనుభూతి, ఆకస్మిక వైరాగ్యం!

అతని కళ్ళల్లో వాళ్ళ రూపాలు భావాలు అతని చెవుల్లో వాళ్ళ కంఠాలు వాటి మాటలు

* * * * * * * * * *

ఎందుకు నాన్నగారూ మా అందర్నీ ఒక్కసారే వ్రాశారు రమ్మని? అని అడిగాడు పెద్దకొడుకు సుందరం

చెప్తాను భోజనాలు కానీయండి అన్నారు రంగనాథంగారు

పెద్దకొడుకు అక్కడ్నించి వెళ్ళిపోయాడు

ఇప్పటికి నలుగురూ అడిగేసారు ఎందుకు రమ్మన్నారని వాళ్ళకు ఎందుకో ఆతృతగా ఉంది కొడుకులికి ముసలి తల్లిదండ్రులు రమ్మన్నారంటే అలాగే ఆతృతగా ఉంటుందేమో? ఆస్తులు పంచుకోవచ్చుని ఆశపడతారు అయినా ఈ ఇల్లు తప్ప నాకుమాత్రం ఆస్తిపాస్తులింకేమున్నాయి? వాళ్ళి నిపుడు పిలిచింది ఆస్తుల పంపకాల గురించి కాదని, బాధ్యతను పంచడాని కని తెలిస్తే దాంతోపాటూ ఈ ఇల్లు సంగతి తెలిస్తే

అలా ఆలోచిస్తుంటే ఎందుకో కాస్త బెరుగ్గా ఉన్నా , పెద్దయ్యాక చేతి కందొస్తారని, బరువు బాధ్యతల్ని పంచుకోడానికి ఉంటారని తమ వంశంలో చాలా మందికి ఒక్కొక్క సంతానమే కలుగుతుండగా తనకు చక్కగా కొడుకు తర్వాత కొడుకు పుడుతున్నాడని ఆనందించి కన్న నలుగురు కొడుకులూ ఇప్పుడేం చేస్తారో చూడాలన్న కుతూహలం కూడా ఉంది రంగనాథంగారికి

భోజనాలయ్యాయి

రంగనాథంగారి ఎదురుగా కూర్చున్నారు సుందరం శంకరం, గోపాల్ కృష్ణ టేబిల్ ప్రక్కన స్టూలుమీద కూర్చుంది లక్ష్మి

రంగనాథంగారు ఒక్కసారి నలుగురు కొడుకుల్నీ చూసారు ఆ తర్వాత లక్ష్మి వైపు చూసి అమ్మా లక్ష్మీ! నువ్వెళ్ళి పడుకోమ్మా! అన్నారు

లక్ష్మి అక్కడ్నుంచి వెళ్ళిపోయింది

మీ అందర్నీ ఒక్కసారే రమ్మని ఇబ్బంది పెట్టాను కదూ!?

ఇందులో ఇబ్బందేం ఉంది నాన్నగారూ?

ఇబ్బంది అనుకుంటే ఎలా నాన్నగారూ?

ఇబ్బందేం లేదండి

పాసే కదండీ నాకు

కొడుకుల సమాధానాలు విన్నాక ఒక నిముషం నేల వంక చూసి ఆ తర్వాత సుందరం వైపు చూస్తూ

ఒరేయ్! లక్ష్మికి పెళ్ళీడు వచ్చింది దాన్నో ఇంటిదాన్ని చేయాల్సిన తరుణం వచ్చింది అందుకే మిమ్మల్నందరినీ రమ్మన్నాను అన్నారు

మేం కూడా అదే అయ్యుంటుందని అనుకున్నాం నాన్నగారూ! అన్నాడు సుందరం కానీ ముఖంలోని భావంలో ఏదో మార్పు కన్పించింది రంగనాథంగారికి

అదే అనుకుంటే ఫర్వాలేదు ! చెప్పండి ఏం చేద్దాం?

సంబంధం ఏదయినా చూసారా నాన్నగారూ? అని అడిగాడు శంకరం

శంకరం వైపు అదోలా చూస్తూ దానికి నలుగురు అన్నయ్యలుండగా నేను చూడ్డం ఎందుకురా? అన్నారు రంగనాథంగారు

అహఁ నా ఉద్దేశం అదికాదు నాన్నగారూ ఏదైనా సంబంధం వచ్చిందేమో నని తడబడుతూ నసిగాడు శంకరం

ఇంకా ఏం లేదురా చూడాలి సంబంధం చూసే ముందు మీకు చెప్పాలి కదా, ఎంతకు తూగ్గలమో చూసుకుని కదరా, మనం సంబంధాలు చూడాల్సింది?

మీ ఉద్దేశం ఎలా ఉంది నాన్నగారూ? అన్నాడు గోపాల్

ఒక్కగానొక్క కూతురు నాకు అన్నీ బాగానే జరిపించాలని ఉంది నా ఉద్దేశం ఎలా ఉన్నా నా దగ్గర ఉన్నది ఏముంది? అంతా మీ ఓపికమీద ఆధారపడి ఉంది

ఆ మాట అన్నాక రంగనాథంగారు నలుగురు కొడుకుల వేపూ పరిశీలనగా చూసారు నలుగురి దృష్టీ నేలమీదనే తారట్లాడుతోంది

ఒక నిముషం గడిచాక, చెప్పండిరా, ఏం చేద్దాం అంటారు? అని అడిగారు రంగనాథంగారు

ఏదో సింపుల్‌గా కానిస్తే బాగుంటుంది అన్నాడు నెమ్మదిగా సుందరం

అవును సింపుల్‌గా కానిసే బాగుంటుంది నీకు మరి మీకెలా అయితే బాగుంటుందిరా? అని మిగిలిన ముగ్గురి వైపూ చూసి అన్నారు రంగనాథంగారు

ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు

చెప్పండిరా మీ అభిప్రాయం కూడా చెప్పండి మీ పెళ్ళిళ్ళు నేను ఎలా ఎలా చేశానో దృష్టిలో ఉంచుకొని చెప్పండిరా సింపుల్‌గా అంటే ఎలా చేద్దామని మీ ఉద్దేశం?

నాన్నగారూ, మా అభిప్రాయాన్ని కాస్త ఆలకించండి పెళ్ళికి చేసే ఖర్చుల్లో చాలా అనవసరమయినవే ఉంటాయి అలాటివాటిని మానేస్తే బాగుంటుందని నా అభిప్రాయం ఏమంటార్రా మీరు అన్నాడు శంకరం

నాన్నగారి ఇష్టం అన్నారు సుందరం, గోపాల్

నువ్వన్నది నేను కాదనను కానీ ఒక్కగానొక్క కూతురని నాకు, ఒక్కగానొక్క చెల్లెలని మీకు ఉన్నా లేకపోయినా ఒక్కగానొక్క కూతుర్నని,

నలుగురన్నయ్యలకు ఒక్కగానొక్క చెల్లెల్ని దానికి ఆ మాత్రం వైభవంగా చేసుకోవాలని ఉంటుందని నేననుకొంటున్నాను పైగా అది మీ పెళ్ళిళ్లను చూసిందాయె అన్నారు రంగనాథంగారు

మా పెళ్ళిళ్ళు జరిగింది మాకొచ్చిన కట్నాలతోనే కదా? ఆడపిల్ల విషయంలో కట్నకానుకలిచ్చి అంత వైభవంగా చెయ్యాలంటే చాలా కష్టం అని దానికి మాత్రం తెలీదా? అన్నాడు కృష్ణ

ఆఖరి కొడుకు మాట విని విస్మయంగా చూస్తూ

నువ్వింకా ఏమీ మాట్లాడలేదేమిటా అనే ఎదురు చూస్తున్నానురా ఆఖరువాడివి నీ తర్వాత దానికోసం నువ్వెలా మాట్లాడతావో అనుకున్నాను గానీ, నువ్వుకూడా చక్కగానే మాట్లాడుతున్నావురా

ఆడపిల్ల విషయంలో అన్నీ ఇచ్చి వైభవంగా పెళ్లి చేయడం కష్టం అన్నావ్ మరి మిమ్మల్ని చేసుకున్నవాళ్ళు కూడా ఆడపిల్లలే కదరా మరి వాళ్లెలా చేసారంటావ్? అని అడిగారు రంగనాథంగారు

వాళ్ళింటో ఉన్నవాళ్ళు

అంటే నీ చెల్లెలు లేనిదా? దానికి ఎవరు లేరురా? తల్లి తప్ప అందరూ ఉన్నారు అంతకు మించి పెద్దపెద్ద ఉద్యోగాలు చేస్తున్న నలుగురు అన్నయ్యలున్నారు ఇంకా ఏం కావాలిరా దానికి?

వాడితో ఏమిటిలెండి నాన్నగారూ దాని పెళ్ళి ఎలా చేద్దామో చెప్పండి మీరు చెప్పినట్టుగానే చేద్దాం అన్నాడు సుందరం

రంగనాథంగారు పెళ్ళికొడుకు హోదా దగ్గరనుండి పెళ్ళి మంటపం, పెట్టుపోతలు పెళ్ళిబో జనాలు, సారె అలా అన్నీ చెప్పారు

మరి కట్న కానుకల గురించి ఏ మాలో చించారు? అని అడిగాడు శంకరం

కట్నం గురించి మనం ఊహించలేం కదరా మనమ్మాయి నచ్చినతను ఎంత అడుగుతాడో ఏమో లక్ష్మికి పెట్టే బంగారం మాత్రం ఈ ఖర్చులో కలవదు మీ అమ్మ నగలు దానికిద్దామని నా ఉద్దేశం ఆపైన మీరింకేదయినా చేస్తే చెప్పండి ఆలోచిద్దాం!

అమ్మ నగలు దానికి ఒక్కర్తికే ఇచ్చేస్తే ఒదినలు ఏమంటారో? అన్నాడు కృష్ణ

ఒదినలేమంటారో నని అంటావేరా నీ భార్య ఏమంటుందో అడిగి చెప్పు నీ తల్లికున్న ఆ కొద్ది నగలు దానికిచ్చేస్తే బాగుంటుందో అందరికీ పంచితే బాగుంటుందో ఆలోచించి చెప్పమను అన్నారు రంగనాథంగారు

ఆ మాటలకు ఎవ్వరూ ఏమీ అనలేదు

మళ్ళీ రంగనాథంగారే అన్నారు ఆ నగల విషయం తర్వాత ఆలోచిద్దాం లేరా, ముందు ముఖ్యమైన వాటి గురించి చెప్పండి ఏం చేద్దాం!?

మీరు చెప్పినదాన్నిబట్టి చూస్తే కట్నం కాక కనీసం ఏభైవేలేనా ఉండాలి అన్నాడు సుందరం

అవును నేను చెప్పినట్టుగా అన్నీ అలా చేయాలంటే ఆ మొత్తం ఉండాలి అందులో



ఏమ్మైనా తగ్గించాలని అనుకుంటే తగ్గిద్దాం ఎంత తగ్గించినా ముప్పై నలభైవేల మధ్య అవుతుంది మనలాంటి కుటుంబాల్లో ఆడపిల్ల పెళ్ళికి అమాత్రం ఖర్చు తప్పదు పుస్తెలు పట్టుకొని గుడిలో చేసేద్దాం అంటే అది సులభమే అయినా అవతలివాళ్ళు ఒప్పుకుంటారా? ఎవర్నీ పిలవకుండా పెళ్ళిఅయిపోయింది అని అనిపించగలమా? అలా చేసెయ్యడానికి నాకు మనస్కరించడంలేదు కనీసం మీకున్నంత హోదా గలవాడ్నైనా దానికి భర్తగా తేవడం సమంజసం అని నేననుకుంటున్నాను

అవును నాన్నగారూ, ఎంత తక్కువలో చేయాలన్నా ఆ మాత్రం ఉండాలి చేతిలో మా చెల్లెలి భర్త మాకంటే గొప్పవాడే అయుండాలి గానీ, మాకంటే తక్కువవాడు కావడం మాకు ఇష్టంలేదు కానీ అంత మొత్తాన్ని

అన్నదమ్ములైన మీరే భరించాలి ఈ విషయాన్ని నేను విడమరచి చెప్పక్కర్లేదు కుటుంబంలోని బాధ్యతల్ని కుటుంబ సభ్యులే వహించాలికదా?

అవుననుకోండి కానీ నా దగ్గర ప్రస్తుతం ఏమీ లేదు మీకు తెలుసుకదా మొన్ననే ఇల్లు కట్టాను నేను దానికోసం చేసిన అప్పు ఇంకా అలాగే వుంది అన్నాడు సుందరం

నా పరిస్థితి మీకు తెలియందేముంది నాన్నగారూ? మీ కోడలికి పిల్లలికి ఎప్పుడూ అనారోగ్యమే కదా, నా జీతం ఇంటికే సరిపోవడం లేదు అన్ని లోన్లూ తీసేసాను అన్నాడు శంకరం

ఇలాంటి పరిస్థితిలోనే సమయానికి చేతిలో డబ్బు లేకపోయిందని నా కెంతో బాధగా ఉంది ఆఫీసుకు వెళ్ళడం ఇబ్బందిగా ఉందని మొన్ననే స్కూటర్ కొనేసాను లోన్లు ఏమైనా పెట్టినా జీతం తెగిపోతుంది. ఆ తర్వాత జీతం సరిపోక చాలా బాధపడాల్సివస్తుంది అన్నాడు గోపాల్

నేను జాబ్‌లో చేరి ఎన్నాళ్ళయ్యింది నాన్నగారూ? నా దగ్గరేం డబ్బులేదు ఏ లోన్‌కీ ఎలిజిబిలిటీ రాలేదు అన్నాడు కృష్ణ

ఒకరి తర్వాత ఒకరు వరుసగా అన్న ఆ మాటలు విని రంగనాథంగారి గుండె బరువెక్కిపోయింది

# గొప్పవాడు

ఆయనకు కొడుకుల్ని ఎన్నో మాటలు అనాలని ఉన్నా గుండెలోంచి వెల్లువలా పొంగివస్తున్న బాధ అతని గొంతుక్కి అడ్డుపడిపోయింది

ఒక నిముషానిగ్గానీ ఆయనేమీ మాట్లాడలేక పోయారు

అందరికీ అన్ని కారణాలూ ఉన్నాయి నాకూ కారణం ఉంది చెప్పడానికి, చెప్పి తప్పించుకోడానికి కానీ నేను కూడా మీలాగే మాట్లాడి తప్పించుకోగలనంటారా? లక్ష్మి పెళ్ళి చేయడానికి మరే మార్గం లేదంటారా? దాని జీవితాన్ని పట్టించుకోవాల్సిన అవసరం మనకెవరికీ లేదంటారా?"

లేదని ఎందుకంటాం నాన్నగారూ? తప్పించుకోవాలని ఎందుకుంటుంది ఎవరికైనా? సమయానికి అందరి పరిస్థితీ బేలగా వుంది అందుకే ఒకపనిచేద్దాం నాన్నగారూ ! అన్నాడు శంకరం

ఏంచేద్దాం?

ఓ నాలుగేళ్ళు ఆగుదాం లక్ష్మికి అప్పుడే ఏం వయసొచ్చిందని?

అవును దానికింకా పెద్దవయసు రాలేదు ఆ విషయం నాకూ తెలుసు నాలుగేళ్ళు ఆగితే దాని పెళ్ళికోసం మీరంతా కష్టపడి డబ్బు దాయడానికి అవకాశం ఉంటుంది అదేగా మీ ఆలోచన? ఆ ఆలోచన నాకూ వచ్చింది నచ్చిందికూడా!

మీకు నచ్చితే ఇంకేం నాన్నగారూ? అలాగే చేద్దాం! ఏం అన్నయ్యా ఏరాగోపాల్, కృష్ణా మీరేమంటారు? అన్నాడు సంతోషంగా శంకరం

నాన్నగారిష్టం అలాగే చేద్దాం! అన్నారందరూ

అందరి ముఖాల్లోనూ సమస్య మబ్బులా విడిపోయిందన్న సంతోషం కానీ రంగనాథం గారిలో కోపం ఉవ్వెత్తున లేస్తోంది

దాన్ని అతి కష్టంమీద తమాయించుకొని మీ అందరూ కలసి చక్కని నిర్ణయానికి వచ్చారు కానీ నాకో అనుమానం, ఇంకో నాలుగేళ్ళు దాటితే దానికి పెళ్ళి చేసుకొనే వయసు దాటిపోతుందేమో? ఆ తరువాత దాన్ని చేసుకోడానికి ఎవ్వరూ రాక పోవచ్చునేమో? ఆఖరికి రెండో పెళ్ళివాడితో తప్ప మీరు ఎంత డబ్బు ఖర్చుపెట్టినా దాని పెళ్ళి చేయలేరేమో? అని అన్నారు

తండ్రి మాటలకు నలుగురికీ నోటివెంట మాట రాలేదు తండ్రి మాటల్లోని ఆ ఎత్తిపొడుపు వాళ్ళకు చికాకు కలిగించింది

అయితే మీ ఉద్దేశం ఏమిటో చెప్పండి అన్నాడు సుందరం

లక్ష్మి పెళ్ళి ఈ సంవత్సరంలో జరిగితీరాలి! అన్నారు నిశ్చయంగా రంగనాథంగారు

లక్ష్మి పెళ్ళి ఈ సంవత్సరంలోనే చేయాలనుకుంటే దానికి ఒక్కటే మార్గం నాన్నగారూ! అన్నాడు సుందరం

ఏమిటది? అన్నట్లుగా చూసాడు రంనాథం గారు కొడుకు వైపు

మనిల్లు అమ్మేసి వచ్చే ఆ డబ్బు సరిపోయేలా అన్నీ ప్లాన్ చేసుకుంటే సరి! అన్నాడు సుందరం

పెద్ద కొడుకు ఏమంటాడో అని అనుకున్నారేగాని ఇల్లు అమ్మేద్దామని అంటాడని ఊహించని రంగనాథంగారు ఆ మాట విని మ్రాన్పడిపోయారు

అవున్రా! ఇల్లు సంగతి నేను మరిచేపోయాను- అలాగే చేద్దాం! కానీ నువ్వు అమ్మేస్తే బాగుంటుంది అన్నది నువ్వు పుట్టి పెరిగి పెద్దవాడవై చదువుకొని ప్రయోజకుడవై పెళ్ళి చేసుకొని ఓ ఇంటివాడివైన ఈ పాత ఇంటి గురించా? లేక నీ తెలివి తేటలతో జాగ్రత్తతో కష్టపడి కట్టించిన క్రొత్త ఇంటి గురించా? మనిల్లు అన్నావ్ ఏదిరా మనిల్లు? నాదా? నీదా?

ఎంత అణుచుకోవాలని ప్రయత్నించినా తన ఆవేశాన్ని అణచుకోలేక పోయారు రంగనాథం గారు


మేం ఏం చెప్పినా మీరు అదోలానే మాట్లాడుతున్నారు మనసులో ఏదైనా ఉంటే సూటిగా అనేయండి గానీ ఇలా నిష్ఠూరంగా మాట్లాడడం దేనికి? చేతిలో డబ్బులేదని అన్నాం, ఏం చేద్దాం అని అడిగితే ఏదో మార్గం ఆలోచించి బాగుంటుందా లేదా అని అడుగుతున్నాం ఇంతకంటే మేం ఏం చేయాలో చెప్పండి చేస్తాం! అన్నాడు సుందరం

ఏం చేయమంటార్రా అప్పులు చేసేసి దాన్ని అత్తగారింటికి పంపేయ మంటారు అంతకంటే ఏం చేయమంటారీయన? అన్నాడు శంకరం

అలాగే ఉంది ఊరుకుంటే మన మావగార్లు ఇచ్చిన బంగారాలు అమ్మేసి చేసేయ మంటారు మనం ఏమైపోయినా ముందు ఇమిడియట్‌గా దానిపెళ్ళి జరిగిపోవాలి ఆయనకు అన్నాడు గోపాల్

ఆ ముగ్గురు మాటలు విన్న రంగనాథం గారు అవాక్కై పోయారు కొడుకులు కాస్త అదో రకం అనుకున్నారు గానీ ఇంతలా మాట్లాడతారు అని అనుకోలేదు రంగనాథం గారు

ఏరా! ఆఖరువాడివి నువ్వు ఏమీ అనవే



దేంరా? అన్నారు కృష్ణ వైపు చూసి

అనడానికి ఏముంది? ఏమన్నా మమ్మల్ని అపార్థం చేసుకోవడం తప్ప మీరు పరిస్థితిని అర్థం చేసుకోరుగా? అన్నాడు కృష్ణ

అవునా! నేను మిమ్మల్ని అర్థం చేసుకోలేక పోతున్నాను మీ అంత తెలివి తేటలు నాకు లేవు మరి కలసి పూనుకొని చేయాల్సిన చెల్లెలు పెళ్ళి గురించి నేను కదిపితే తప్ప మీరేమీ మాట్లాడ లేదు మాట్లాడే మాటలు కూడా చేయాల్సిన కార్యక్రమాన్ని ప్రారంభించేలా లేవు నలుగురూ కలసి నాలుగు అక్షింతలు వేస్తారను కున్నాను గానీ ఈ ఇంటి నాలుగు స్తంభాల్నీ పెకిలించి వేద్దాం అని అంటారనుకోలేదు ఎందుకంటే మీకు పుట్టి పెరిగిన ఇంటి మీద మమకారం ఉంటుందను కున్నాను నా పిచ్చిగానీ రక్తాన్ని పంచుకొన్న వాళ్ళ మీద లేని మమకారం ఈ ఇంటి మీద మీ కెందుకుంటుంది? మీరు చెప్పినట్టు నేను ఈ ఇంటిని అమ్మేసైనా కూతురు పెళ్ళి చేసేవాడిని కానీ ఈ ఇంటి మీద బోలెడంత అప్పు ఉంది పెళ్ళి విషయం తేలిన తర్వాత ఈ విషయం కూడా చెప్పి ఇది మరొకరికి హస్తగతం కాకుండా చేసుకోవాలి అని అందామను కున్నాను కానీ పురిటిలోనే సంధి జరిగింది

ఈ ఇంటి మీద అప్పా? మా కెప్పుడూ చెప్పలేదేమండి? ఆశ్చర్యంగా అన్నాడు శంకరం

ఎందుకురా అంత ఆశ్చర్యంగా అడుగు తున్నావ్? మీ తండ్రి సంపాదన మొదట్లో ఈ ఇంటిని కొన్నా, ఆ తర్వాత మీ చదువులు, మీ అవసరాలు, మీ ఇంటర్వ్యూలు వీటన్నింటికీ అదొక్కటే సరిపో లేదురా నీ ప్రశ్నకు నా సమాధానం అప్పుడే అర్థం కాదురా బాధ్యతలు పెరుగుతూ ఉంటే వాటి ముందు సంపాదనలు వెలవెలబోతుంటే అప్పుడు అర్థం అవుతుంది ఎప్పుడూ చెప్పలేదేమని అడిగావ్, మీకు చెపుదామనుకుంటే అప్పుడు మీకు రెక్కలు రాలేదు రెక్కలు వచ్చాక నాకు చెప్పే అవకాశం రాలేదు అవకాశాన్ని కల్పించుకొని చెప్పిన విషయాలకు మీ దగ్గర్నుండి సరియైన సమాధానం రాలేదు నేను సూటిగానే మాట్లాడు తున్నాను, మీరే చెల్లెలి పెళ్ళికి మేము బాధ్యత వహించలేం అని సూటిగా చెప్పలేక పోతున్నారు ఈ సమయంలో మీ అమ్మ ఉండి ఉంటే భరించలేక పోయేది పోయి అది చాలా అదృష్టం చేసుకుంది ఎండుటాకులా ఉండి నేనివన్నీ వినాల్సిన దురదృష్టాన్ని చేసుకున్నాను మిమ్మల్ని ముఖ్యంగా రమ్మని వ్రాసింది లక్ష్మి పెళ్ళి గురించే కాదు ఈ ఇంటి మీదున్న అప్పు గురించి చెప్పడానికీ కాదు ఒక సంతోషమైన వార్తను చెప్పి ఆ తర్వాత ఈ విషయాలు చెబుదామను కున్నాను కానీ ఈ విషయాలు చెప్తే మీ మాటలు ఎలా ఉంటాయో విని ఆ తర్వాత చెప్పొచ్చులే ఆ విషయాన్ని అనుకొని ముందు ఈ విషయాలు చెప్పాను

తండ్రి మాటలు నలుగురు కొడుకులికి విస్మయాన్ని కలిగించాయి తండ్రి చెప్తున్న దేమిటో వాళ్ళకు పూర్తిగా అర్థం కాలేదు ఆ సంతోషమైన వార్త ఏమిటో తెలుసుకోవాలని వాళ్ళలో ఆతృత బయల్దేరింది

ఏమిటి నాన్నగారూ సంతోషమైన వార్త అంటున్నారు?

చెప్తానురా కాస్త బాధను దిగమ్రింగు కోనీయండి అని కాసేపు ఆగారు రంగనాథం గారు

అన్నదమ్ము లందరూ ఆ కాసేపు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు

నిజంగా నేనేనాడో అదృష్టం చేసుకున్నానని అనుకున్నాను మీ నలుగురూ పుట్టినప్పుడు అప్పుడప్పుడూ గర్వపడేవాడిని కూడా నాకీ రోజు గర్వభంగం జరిగినా ఎవరికి వాళ్ళు ఏదో చెప్పేసి తప్పించుకుంటున్నా నేనింకా అదృష్ట వంతుడ్నేరా నేను అదృష్టవంతుడ్ని కాబట్టే ఈ వయసులో ఈ అవసరంలో నాకు పది లక్షల రూపాయల లాటరీ తగిలింది దాంతో నా కూతురు పెళ్ళి అతి వైభవంగా చేసి నా శేష జీవితాన్ని దర్జాగా నలుగురు కొడుకుల్నున్నా నన్ను చూస్తారో లేదో నన్న బెంగ లేకుండా హాయిగా గడిపేస్తాను మీ మనసులు అర్థమయ్యాయి కాబట్టి అందులో చిల్లిగవ్వ కూడా మీ కివ్వను మీ కోసమంటూ అందులోది ఒక్క పైసా మిగల్చను ఇంక వెళ్ళండి నిద్రపొండి అని లేచారు రంగనాథం గారు

నలుగురు కొడుకులూ విషయం విని నిశ్చేష్టులై అలాగే ఉండిపోయారు

* * * *

మొదట్నుంచీ వాళ్ళ ప్రవర్తనలు నాలో అనుమానాన్ని కలిగించినా వయసులో ఉన్నవాళ్ళు, ఈ మధ్యనే ఎదుగుతున్న వాళ్ళు కదా అని సరిపెట్టుకుంటూ వచ్చాను కానీ చెల్లెలు పెళ్ళి విషయంలో ఇలా మాట్లాడి ఆఖరుకు తప్పించు కుంటారని అనుకోలేదు

కానీ వాళ్ళ మాటలు ఎలా ఉంటాయో ముందుకు వచ్చి బాధ్యతను పంచుకోవాల్సిన ఈ సమయంలో వాళ్ళు ఎలా ప్రవర్తిస్తారో చూద్దామను కున్నాను వాళ్ళ మాటల్లో ఘోరమైన చేదును చవి చూసాను వాళ్ళ ఆ మాటలు విన్నప్పుడు కాస్త చలించిన మాట నిజం! కానీ ధైర్యం తెచ్చుకొని అడుగు ముందుకు వేయబోయాను


అంతలో అదృష్టం కొద్దీ అనుకున్నదాని కంటె ఎక్కువే జరిగింది నా సమ్మతం లక్ష్మికి సంతోషాన్నిచ్చింది లక్ష్మి సంతోషం నాకు సంతృప్తి నిచ్చింది

చెల్లెలు పెళ్ళి తామ్ము లేకుండా జరిగిపోయిందన్న బాధతో కాకపోయినా ముఖం మీదకు తెచ్చిపెట్టుకున్న బాధతో, మరో దానిమీద ఆశతో వాళ్ళు తప్పకుండా వస్తారు రాకుండా ఉండలేరు!

గడియారం ఒక గంట కొట్టింది

తనలో తనే జరిగిందాన్ని గుర్తుకు తెచ్చుకొని జరగబోయే దాన్ని ఊహించుకొని అలా నిద్రలోకి జారిపోయారు రంగనాథంగారు

* * *




రంగనాథంగారు అనుకున్నట్టుగానే ఉత్తరాలు అందిన వెంటనే నలుగురు అన్నదమ్ములూ కలసి వచ్చేసారు వాలు కుర్చీలో మౌనంగా కూర్చున్న అతని చుట్టూ చేరారు

మీరు వ్రాసిన ఉత్తరం అందింది ఉపోద్ఘాతంలా అన్నాడు సుందరం

మీరు వస్తారని ఊహించాను కోడళ్ళు పిల్లలు అందరూ బాగున్నారా? అన్నారు రంగనాథం గారు

బాగానే ఉన్నారు

వాళ్ళను కూడా తీసుకు రావాల్సింది

శెలవులు ఎక్కువ లేవు గాబట్టి నాలుగు రోజులు ఉండడానికి వీలవ్వదని తీసుకు రాలేదు అన్నాడు శంకరం

పోనీ వాళ్ళు ఉండేవారుగా నాలుగు రోజులు

మేం కూడా అదే అన్నాం కానీ మీరు చేసిన పనికి వాళ్ళు చాలా బాధపడ్డారు అన్నాడు గోపాల్

మీ అందరూ ఉండేది వేరు వేరు ఊళ్ళల్లో కదరా

ఒక్కచోట ఉన్నట్టుగా కలసికట్టుగా ఎలా వచ్చారు? ఒకరి కొకరు మాట్లాడుకున్నట్టుగా మీ బార్యలు రాకపోవడానికి ఒకే కారణం ఎలా చెప్తున్నారు?

మా ఆపీసుల్లో ఫోన్లున్నాయి కదా! అన్నాడు శంకరం

ఓహో పోన్ల ద్వారా మాట్లాడుకొని కలసి వచ్చారా? మీ బార్యలు అంత బాదపడ్డారా? వాళ్ళకు ఆడపడుచు పెళ్ళి జరగడం ఇష్టం లేదా?

ఇష్టం లెక బాదపడ్డం కాదు నాన్నగారూ! ఎంతైనా ఒక్కగానొక్క ఆడపడుచు కదా ఆ మాత్రం బాద ఉండదా? అన్నాడు సుందరం

పోన్లే, వాళ్ళకైనా ఆ మాత్రం అబిమానం ఉంది

వ్రాసే ఆ ఉత్తరం పెళ్ళికి ముందు వ్రాసి ఉంటే ఎంత బాగుండేది నాన్నగారూ? అన్నాడు కృష్ణ

మీ చెల్లెలు లక్ష్మి కూడా పెళ్ళికి ముందే వ్రాయమంది కానీ నేనే వ్రాయలేదు

మేమంటే అంత కోపం ఎందుకు నాన్నగారూ, మేమేం చేసామని? అన్నాడు గోపాల్

అవును చెల్లెలి పెళ్ళికి మీరేం చేసారని మీకు ముందుగా వ్రాయాలి?

పైవాళ్ళ కన్నా అద్వాన్నం అయిపోయింది మా పరిస్థితి తనలో తనే గొణుక్కున్నాడు సుందరం

పైవాళ్ళలాగే ప్రవర్తించారుగా మీరు? దాని గురించి పట్టించుకుంటే మీ మావగార్లు పెట్టిన బంగారాలు అయిపోతాయని బయపడ్డారు కానీ అది అదృష్టవంతురాలు అందుకే దాని జీవితం బంగారు మలుపు తిరిగింది ఒక విదంగా మీరూ అదృష్టవంతులే, అందుకే మీకు నయాపైసా ఖర్చు కాలేదు చెల్లెలి పెళ్ళి నిమిత్తం! అన్నారు రంగనాథం గారు

ఒక్క క్షణం ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు తర్వాత సుందరం అన్నాడు

ఆ రోజు నిజంగా మా చేతుల్లో డబ్బులేక అలా మాట్లాడవలసి వచ్చింది గానీ లక్ష్మి పెళ్ళి చేయడం మా అందరి బాద్యతా కాదా నాన్నగారు? వెళ్ళిపోయాక మేం అందరం బాదపడ్డాం

# గొప్పవాడు

తొందరపాటుగా మాట్లాడామమోనని ఎవో అమ్మేసి లక్ష్మి పెళ్ళి చేసేద్దాం అనుకుంటుండగానె దాని పెళ్ళి జరిగి పోయిందని మీరు ఉత్తరం వ్రాసారు క్రితం సారి మేం వచ్చిన మర్నాడు మీతో ఎన్ని మాట్లాడినా మమ్మల్ని వెళ్ళిపొమ్మన్న మాట తప్ప మీరింకేమీ మాట్లాడలేదు మీకు కోపం తగ్గాక మరోసారి వద్దామనుకొని వెళ్ళిపోయాం అప్పుడు అయిపోయిందేదో అయిపోయింది గానీ ఇంతకూ లక్ష్మి బర్త, అదే మా బావగారు ఎవరు? ఏ ఊరు? ఏం చేస్తున్నారు?

సుందరం మాటలు విని రంగనాథం గారు నవ్వారు చిన్నగా

ఎవరో చెప్తే మీకు తెలిసి పోయేంత గొప్పవాడు కాదు గానీ అతని గురించి చెప్తే మంచి మనసున్న వాళ్ళెవరైనా గొప్పవాడేనని అంటారు అతని పేరు క్రాంతి ఈ ఊరే వాళ్ళది స్టేట్ బ్యాంకులో ఆపీసరు

నిజంగా మన లక్ష్మి అదృష్టవంతురాలు పదండి నాన్నగారూ వెళ్ళి వాళ్ళను చూసొద్దాం అన్నాడు సుందరం

మళ్ళీసారి వెళ్ళొచ్చులేరా చూడ్డానికి, ఇప్పుడు వాళ్ళు లేరు పెళ్ళైన క్రొత్త కదా, ఓ పది రోజులు తిరిగి రావడానికి వెళ్ళారు

అంటే హనీమూన్‌కి వెళ్ళారన్న మాట అన్నాడు శంకరం నవ్వుతూ

నాన్నగారూ, బ్యాంక్ ఎంప్లాయి కదా అందులోనూ ఆఫీసరు కట్నం ఎంతిచ్చారండి? అని అడిగాడు గోపాల్

ఇంత అని ప్రత్యేకంగా ఏమీ ఇవ్వలేదురా నాకున్నదంతా వాళ్ళకే ఇచ్చేసాను

అంతా వాళ్ళకే ఇచ్చేస్తే మరి మేం ఏమైపోవాలని మీ ఉద్దేశం? అన్నాడు శంకరం

మిక్కూడా కావాలంటే ఇస్తాను ఒక్కొక్కళ్ళకూ పదేసి వేలు పడుతుంది ఈ ఇంటిమీద అప్పు

అంటే అప్పు మాకు ఆస్తి వాళ్ళకూ ఇస్తారా? అని అడిగాడు కృష్ణ

ఆస్తా? నా దగ్గరేం ఉందిరా అప్పుకు సరిపడే ఈ ఇల్లు ఆ పైన నా పెన్షనూ తప్ప!

మరి లాటరీలో వచ్చిన పది లక్షలూ? అడిగాడు సుందరం

నేనెప్పుడైనా లాటరీ టిక్కెట్లు కొనడం చూసారా మీరు?

మరి మీకు లాటరీ వచ్చిందని అన్నారు? అన్నాడు కృష్ణ

అన్నాను ఆ రోజు మీ మాటలు విని నా మనసు మండిపోయింది అలా అంటే ఎందుకు అలా మాట్లాడేమా అని మీలో మీరే బాదపడి పోతారని విలవిలలాడి పోతారని అలా అన్నాను ఆ రోజు అలా అనబట్టే కదరా మీరీ రోజు ఇలా వచ్చేరు?

మీరు మాతో అబద్ధం చెప్తున్నారు అన్నాడు శంకరం

నేనంత పిరికివాడ్ని కాదురా నిజంగా అంత డబ్బే నాకు వచ్చి ఉంటే దాన్ని మీకు దక్కకుండా చేయాలనుకుంటే ఎన్నో మార్గా లున్నాయి అసలు నాకంత డబ్బు వచ్చిందనే చెప్పక పోయేవాడ్ని దాన్నంతటినీ నా కూతురు అల్లుడికే దక్కేలా చేసేవాడ్ని మీరు నాకంటే ఎక్కువే చదువుకున్నా అనుబవంలో మీ కంటే పెద్దవాడిని ఆ మాత్రం మేనేజ్ చేయలేక పోయేవాడ్ని కాదు

అయితే లక్ష్మి పెళ్ళి !

ఎలా చేసాననా నీ అనుమానం గోపాల్ ! లక్ష్మి పెళ్ళి నేను చేయలేదురా అతనే అన్నీ చేసుకున్నాడు అతనికి నేనిచ్చింది నా కూతుర్నేరా దాంతోపాటూ ఈ ఇంటి మీద అప్పునీ నా మంచి చెడ్డల్ని చూసే బాద్యతనీ అతనే తీసుకున్నాడురా!


మీరు చెప్తున్నది నేను నమ్మలేక పోతున్నాను నాన్నగారూ! అన్నాడు సుందరం

ముందే చెప్పానుగా అతను గొప్పవాడని అలాంటి పురుషులు ఈ సమాజానికి ఎంతో అవసరం అయినా అలాంటి వాళ్ళు చాలా కొద్ది మంది మాత్రమే ఉంటారు కాబట్టి మీకు నమ్మకం కుదరక పోవచ్చు మీరు నమ్మినా నమ్మకపోయినా నేను చెప్పేది నిజం! లక్ష్మి, క్రాంతి ప్రేమించుకున్నారు లక్ష్మి పెళ్ళి గురించి మనం మాట్లాడుకున్న తర్వాత మీరు వెళ్ళిపోయాక నేను సంబందాల కోసం ప్రయత్నిస్తుంటే లక్ష్మి చెప్పింది తను అతనిని ప్రేమిస్తున్నానని ఆ తర్వాత అతనిని తీసుకు వచ్చింది అతన్ని చూసాక అతని మాటలు విన్నాక నాకు నమ్మకం కుదిరింది కాదంటే జరిగేదేమిటో వాళ్ళ మాటల్లో అర్థమయ్యాక నేను కాదనలేక పోయాను

అయితే అతని కులం? మన వాళ్ళేనా?

మన కులం కాదు కానీ నాకు కూతురు, మీకు చెల్లెలు అయిన లక్ష్మికి బర్త కాబట్టి అతను, అతని వాళ్ళు మనవాళ్ళే!

చాలా బాగుంది నాన్నగారూ! ఇది మన పరువు ప్రతిష్ఠలు వంశ మర్యాదలకు సంబంధించిన విషయం అని కొంచెం కూడా ఆలోచించకుండా



చాలా మోరం చేసారు  ఇప్పుడు నలుగురిలోనూ తలెత్తుకు తిరగడం ఎలాగండీ? అన్నాడు చాలా కోపంగా బాధగా సుందరం

ఏరా ఇందులో తలెత్తుకు తిరగలేక పోవడానికి ఏముంది? నేను చేసిన పని అంత తప్పుగా కన్పిస్తుందా? నాకు మాత్రం నేను చేసిన పని తప్పనిపించడం లేదు

మీకు అన్పించదు లెండి  మా మీద పంతంతో ఇలాంటి పని చేస్తారని ఎప్పుడూ అనుకోలేదు అప్పుడు మాతో అన్నారుగా ఎవర్నీ పిలవకుండా పెళ్ళెలా చేస్తామని? ఇప్పుడు బంధువులు కాదు కదా, కన్న కొడుకుల్ని కూడా పిలవకుండా దాని పెళ్ళి జరిపించేసారు  మాతో మాట్లాడినప్పుడు చాలా ఖర్చు అవుతుందన్నారు మేము తట్టుకోలేమని అంటే నిష్ఠూరంగా మాట్లాడేరు  ఇప్పుడెలా చేసారు ఈ పెళ్ళి? ఒక్క ఉత్తరం వ్రాసి ఉంటే వచ్చి ఈ ప్రేమ గొడవేమిటో తేల్చేసి ఏదో సంబంధం చూసి మెడలు వంచి దాని పెళ్ళి చేసేవాళ్ళం! అన్నాడు ఆవేశంగా శంకరం

అవున్రా, నువ్వన్నదీ నిజమే! అప్పుడలా అనుకున్నాను  కట్నాలు, కానుకలు ఇలాంటి ఖర్చులయ్యే మామూలు పెళ్ళి నా కూతురికి చేద్దామని అనుకున్నాను  కానీ ఇప్పుడు దాని మనసుకు నచ్చినట్టు చేసాను  మెడలు వంచి చేసేది పెళ్ళి కాదురా! మనసుల్ని అర్థం చేసుకున్నవాళ్ళు జీవితాన్ని పంచుకుంటే బాగుంటుందని అన్పించింది అందుకే వాళ్ళ పెళ్ళికి ఒప్పుకున్నాను  మీరిలా మాట్లాడి వాళ్ళ మనసుల్ని బాధ పెడతారనే వాళ్ళిద్దరూ ఎంత చెప్పినా పెళ్ళి ముందు మీకు తెలియ పరచలేదు

మీరీ పెళ్ళికి ఎందుకు ఒప్పుకున్నా నలుగురూ కూతురి పెళ్ళి చేయలేక ఇలా చేసారని అనుకుంటారు! అన్నాడు కృష్ణ

మీ మనసుల్ని తెలుసుకున్నాక మీరైతే ఇలాగైనా చేస్తారని నేననుకోలేదురా  ఎవరేమనుకున్నా నాకేం ఫర్వాలేదురా వాళ్ళు సుఖంగా ఉండడమే నాకు కావాల్సింది

సుఖం  ఈ  సుఖం  ఎన్నాళ్ళుంటుంది నాన్నగారూ? ఇలా రెండు కులాలకు చెందిన వాళ్ళు పెళ్ళి చేసుకుంటే వాళ్ళకు పుట్టిన వాళ్ళ కులం ఏమిటని ఈ సమాజం అడిగినప్పుడు, దానికి సమాధానం ఏం చెప్పాలో తెలియక తడుముకున్నప్పుడు తెలుస్తుంది ఇలాంటి వివాహాల్లో ఉన్న సుఖం ఏమిటో? అన్నాడు వెటకారంగా గోపాల్


క్రాంతి లక్ష్మిని ప్రేమిస్తున్నానని, పెళ్ళి చేసుకుంటానని చెప్పినప్పుడు సరిగ్గా నేను కూడా మీలాగే ఆలోచించి అలాగే అన్నాను  అప్పుడు క్రాంతి ఏమన్నాడో తెలుసా? "మాకు పుట్టిన వాళ్ళ కులం మానవత్వం, మతం సమానత్వం!" వాళ్ళు ఎదిగే సరికి ఆ కులం, ఆ మతం వాళ్ళే వాళ్ళను పెళ్ళి చేసుకుంటారు ' అని అన్నాడు  అతని ఆ మాటలు విన్నాకనేరా, నేను వాళ్ళ పెళ్ళికి ఒప్పుకుంది  ఈ విషయం గురించి ఇంత వాదన అనవసరం

అనవసరం అయితే మేము వాళ్ళను చూడ్డం కూడా 'అనవసరమే! వాళ్ళను మా వాళ్ళుగా భావించలేం  లక్ష్మికి మాకు ఇంక ఎటువంటి సంబంధమూ లేనట్లే!

ఇదే మీ నిర్ణయం అయితే అలాగే కానీయండి ఇప్పుడు ఎవ్వరికీ ఎటువంటి నష్టమూ లేదు ఎవరి బ్రతుకు వాళ్ళు హాయిగా బ్రతికితే చాలు!

మీ అభిప్రాయం కూడా అదే అయితే మేం చేసేది ఇంకేం లేదు  మేం వెళ్తున్నాం! అని లేచాడు సుందరం  వెంటనే శంకరం గోపాల్ కూడా లేచి నిలబడ్డాడు

రంగనాథంగారు కూడా లేచి నిలబడుతూ అలా అనుకుంటే ఇక్కడ మీరు చేయడానికి కూడా ఏమీలేదు గానీ వెళ్ళండి! అని ఇంకా కూర్చున్న కృష్ణ వైపు చూస్తూ, ఏరా నువ్వు లేవలేదేం? నువ్వూ వాళ్ళలాంటి వాడివేగా నీదీ అదే అభిప్రాయమా? అని అడిగారు




కృష్ణ లేచి నిలబడి  అలాంటి పని చేసిన దానిదగ్గర పవిత్రమైన మా అమ్మ నగలు ఉండడానికి వీలు లేదు  అమ్మ జ్ఞాపకంగా వాటిని మాకిచ్చేయండి! అన్నాడు

ఆఖరి కొడుకు అన్న ఆ మాటలు విని రంగనాథంగారు అదోలా నవ్వారు

ఒరెయ్! నా కొడుకు లందరిలోనూ నిజంగా నువ్వే గొప్పవాడివిరా! ఎందుకంటే బ్రతికున్న వాళ్ళనే మరచిపోడానికి సిద్ధమయ్యారు వాళ్ళు  ఎప్పుడో పోయిన నీ తల్లి పవిత్రతను నువ్వు మరచిపోలేక ఆమె నగల్ని ఇచ్చేయ మంటున్నావ్! నేనా నగల్ని లక్ష్మికి ఇస్తున్నప్పుడు లక్ష్మి వాటిని తీసుకోలేదు మీరు ఆ నగల్ని అడగడం లక్ష్మి విన్నదట  వాటిని మీకే ఇచ్చేయమంది, వాటిని మీకివ్వడానికే నా దగ్గర ఉంచాను  ఈ మాటల్లోపడి వాటి విషయం నేను మరచిపోయినా, నీ అన్నలు మరచిపోయినా నువ్వు మాత్రం మరచిపోలేదు  అందుకే నువ్వు గొప్పవాడివి అని అన్నాను అని ఆ గదిలో ఓ మూలనున్న బీరువా తెరచి అందులోంచి ఆ నగలు బయటికి తీసారు రంగనాథం గారు

ఒరెయ్ కృష్ణా! ఇవిగోరా, తీసుకో  మీ అమ్మ జ్ఞాపకార్థంగా వీటిని తీసుకో అని కృష్ణకు ఆ నగల్ని అందిస్తుండగా  ఆ నగల మీద మా అందరికీ హక్కుంది అన్నాడు శంకరం

ఆ హక్కుల గురించి నాకేమీ తెలియదు వాటిని మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండి  అని వాటిని కృష్ణ చేతికి అందించారు రంగనాథం గారు

వాటి విషయం తర్వాత చూడొచ్చులేరా ఇంక నడవండి! అన్నాడు సుందరం

నలుగురూ ఆ గదిలోంచి బయటికి వెళ్ళిపోయారు  వాళ్ళ వెనుకే రంగనాథంగారు కూడా వెళ్ళారు

కొడుకులు వరండాలోంచి బయటకు అడుగు పెట్టబోతుండగా,, ఒరెయ్! ఆగండి  అన్నారు రంగనాథం గారు

నలుగురూ ఆగి వెనక్కి తిరిగి చూసారు

చిన్నమాట ' ఆ నగల్ని మీరు ఏం చేసుకున్నా నాకేమీ అభ్యంతరం లేదు  పోయిన వాళ్ళ జ్ఞాపకార్థం వాళ్ళ నగలే ఉండనక్కర్లేదు వాళ్ళ మీది ప్రేమ గుండె నిండుగా ఉంటే చాలు  ఒకవేళ మీరు వాటిని పంచుకుంటే మాత్రం పంచుకుంటున్నప్పుడు ఎటువంటి గొడవలూ పడకండి  అన్ని విషయాల్లోనూ కలసి కట్టుగా ఒకేమాట మీదున్నారు ఇంతవరకూ, ఈ విషయంలో కూడా అలాగే ఉండండి  వెళ్ళండి! అన్నారు రంగనాథం గారు

ఆ మాట విని విసురుగా వెళ్ళిపోయారు నలుగురూ!

గుమ్మం లోంచి వరండాలోకిగిరుక్కున తిరిగి వచ్చిన రంగనాథం గారికిఎదురుగా గోడ మీద భార్య ఫోటో కన్పించింది  ఆ ఫోటోనే అలా చూస్తూ ఉండిపోయిన రంగనాథం గారి కళ్ళలోంచి రెండు కన్నీటి చుక్కలు చెంపల మీదకు జారిపడ్డాయి! ☐